క్లుప్తంగా

జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి



వంటపాత్రలు పంపిణీ చేస్తున్న రవీంద్రారెడ్డి

రాపూరు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే వచ్చే ఏడాది జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఎస్ రవీంద్రారెడ్డి అన్నారు. గోనుపల్లె ఉన్నత పాఠశాల్లో శుక్రవారం ప్రభుత్వం అందించిన వంట పాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాలు నిర్మాణం, సర్వస్వతీదేవి విగ్రహం ఏర్పాటు పనులు జరు గుతున్నాయని, వీటిని త్వరలో పూర్తి చేసి, ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి, ఏ గిరీష్‌రెడ్డి, శ్యామ్‌సుంద ర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, సర్పంచ్ నారాయణమ్మ, హెచ్‌ఎం నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

చులకనగా చూడొద్దు



బహుమతులు అందజేస్తున్న అధికారులు

కలువాయి: శారీరకంగా ఏదో ఒక లోపం ఉన్నంత మాత్రాన దివ్యాంగులను చులకనగా చూడకూడదని, మానసికంగా వారు కూడా మిగిలిన వారిలానే ధృడంగా ఉంటారని ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు అన్నారు. కలువాయి ప్రాథమిక పాఠశాలలోని భవిత సెంటర్‌లో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులను మిగిలిన వారితో సమానంగా ప్రోత్సహించి అవకాశాలు కల్పిస్తుందన్నారు. దివ్యాంగులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం అబ్బాస్ అలీ, హెచ్‌ఎం రేణుక, ఐఈఆర్‌టీ విశ్వనాథ్, భానుప్రియ, సీఆర్పీ మహేష్ పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి

రాపూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ ప్రజలకు అందాలని వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వ్యవసాయ సలహమండలి చైర్మన్ రవీంద్రారెడ్డి అన్నారు. రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలన్నారు. ఎంపీడీఓ అప్పాజీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆసక్తి ఉన్న 15 ఏళ్లు నిండిన బాలబాలికలు పేర్లను సచివాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు సయీద్ మాట్లాడుతూ రాపూరులోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని, కొత్త ట్యాంకు నిర్మించాలని కోరారు. పంచాయతీరాజ్ ఏఈ వాసు మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ నిధులతో రాపూరు 5, ఏపూరు 4, నెల్లేపల్లి 1, వేపినాపి 2 రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కొక్కరోడ్డుకు రూ.5 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. జెడ్పీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, వైస్ ఎంపీపీ వెంకటస్వామి పాల్గొన్నారు.

సీఎంకు ఘన స్వాగతం



బాలిరెడ్డిపాలెంలో పర్యటిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్‌చక్రవర్తి

గూడూరురూరల్/వాకాడు: తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించే క్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాకాడు మండలం బాలిరెడ్డిపాళేనికి శుక్రవారం విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. పర్యటనలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రేణిగుంట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కోట మండల విద్యానగర్‌లోని ఎన్‌బీకే ఆర్ట్ కళాశాలలోని హెలిప్యాడ్‌లో 10.55 గంటలకు దిగారు. అక్కడ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాధికారులు సీఎంకు స్వాగతం పలికారు. అనంతరం హెలిప్యాడ్ నుంచి 11.05 గంటలకు బయలుదేరి, బాలిరెడ్డిపాళేనికి రోడ్డు మార్గంలో వెళ్లారు. 11.35 గంటలకు గ్రామంలో తెగిపోయిన స్వర్ణముఖి కరకట్టలను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో కారు దిగి ప్రజలకు అభివాదం చేస్తూ తిరిగారు. 11.53 గంటలకు అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి నష్టం అంచనాలను అడిగి తెలుసుకున్నారు. 12.04 గంటలకు గ్రామస్తులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొని, వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని స్వర్ణముఖిపై హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 12.30 గంటలకు బాలిరెడ్డి పాళెం నుంచి బయలు దేరి రోడ్డు మార్గంలో విద్యానగర్ హెలిప్యాడ్‌కు చేరుకుని, 1.25 గంటలకు బాపట్ల పర్యటనకు వెళ్లారు.

సీఎంతో ప్రముఖులు

గూడూరురూరల్: తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వాకాడుకు వచ్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని విద్యానగర్‌లోని హెలీప్యాడ్ వద్ద శుక్రవారం ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నేతలు పొణకా దేవసేనమ్మ, డీ శ్రీమంతరెడ్డి, డాక్టర్ శ్వేత కలిశారు. హెలిప్యాడ్ వద్ద నేదురుమల్లి ఉదయశేఖర్‌రెడ్డిని సీఎం పరామర్శించారు. అలాగే బాలిరెడ్డి పాళెంలో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కే దామోదరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, సర్పంచ్ వెంకటరత్నమ్మ , ఓ బాలకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.



సీఎంను సత్కరిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ



సీఎంతో సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ శ్రీమంతరెడ్డి



టీటీడీ మెడికల్ అడ్వయిజర్ డాక్టర్ శ్వేత



నేదురుమల్లి ఉదయశేఖరరెడ్డిని పరామర్శిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి

దైన్యంలో ధైర్యం

మిచాంగ్ తుపాను బాధితులకు ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు అండగా నిలిచారు. బాధితులకు నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందజేస్తున్నారు. సహాయక చర్యలు చేపడుతున్నారు. మరో వైపు వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖాధికారులు అఘమేఘాలపై అంచనా వేస్తున్నారు. ప్రభుత్వానికి నివేదికలు పంపి, పరిహారం ఇప్పించడానికి కృషి చేస్తున్నారు.





చిల్లకూరు: కూరగాయలు పంపిణీ చేస్తున్న సనత్‌కుమార్‌రెడ్డి, చిట్టమూరు: నిత్యావసర సరుకులు అందజేస్తున్న నేతలు

చిల్లకూరు: కొంతమంది ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తుపాను బాధితులకు తమ వంతు సహకారం అందించారు. మండలంలోని తిప్పగుంటపాళెంలోని వంద కుటుంబాలకు సర్పంచ్ యల్లంటి సుకన్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు సనత్‌కుమార్‌రెడ్డి వారానికి సరిపోయే కూరగాయలు శుక్రవారం అందజేశారు. కాకువారిపాళెం గిరిజనకాలనీలో 100 మంది బాధితులకు సర్పంచ్ రావుల వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యం అందజేశారు. బల్లవోలులోని గిరిజనకాలనీ, దళితవాడల్లోకి చేరిన వరదనీటిని ఆ గ్రామ సర్పంచ్ డీ మంజులమ్మ, వైఎస్సార్‌సీపీ నేత డీ చంద్రశేఖరరెడ్డి మోటార్లతో తోడించారు. అలాగే కూరగాయలు అందజేశారు.

వైఎస్సార్ కాలనీలో..

వైఎస్సార్ కాలనీలో వరద బాధితులకు జెడ్పీటీసీ మన్నెం శీనయ్య సభ్యుడు సరుకులు పంపిణీ చేశారు. తిప్పగుంటపాళెంలో ఆర్‌ఐ రమ్యస్వాతి సరుకులు పంపిణీ చేశారు. వీ మనోజ్‌రెడ్డి, కే అశోక్, ఎం శ్రీనివాసులు, ఈ అనుదీప్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చిట్టమూరు: తుపాను బాధితులకు వైఎస్సార్ సీపీ నేతలు రాష్ట్రం ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రాఘవవారిపాళెం, ఆరూరు, తాడిమేడు, నార్తువరత్తూరు గ్రామాల్లో గిరిజన కుటుంబాలకు సరుకులు అందజేశారు. నాయకులు డీ సుధాకర్‌రెడ్డి, పీ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పెళ్లకూరు మండలంలో..

పెళ్లకూరు: మండలంలోని కానూరు, దొడ్లవారిమిట్ట, చెంబడిపాళెం గిరిజనులకు ఎంపీపీ శేఖర్‌రెడ్డి నిత్యావసర సరుకులతోపాటు నగదు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, నాయకులు అశోక్, వెంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం

దక్కిలి: వీకేవై సముద్రం(కొత్తపల్లి) గిరిజన కాలనీకి చెందిన 12 కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకులు, నగదును జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ డీ పోలయ్య యాద వ్ పంపిణీ చేశారు. డీటీ హరికృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నగదు అందజేత

దొరవారిసత్రం: మండలంలోని బురదముడుగులో ముంపునకు గురైన 68 కుటుంబాలకు రూ.1.55 లక్షల నగదును రెవెన్యూ అధికారులు అందజేశారు. అలాగే నిత్యావసర సరుకులు అందజేశారు. పలు గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు దెబ్బతిన్న పంటను పరిశీలించారు. మండల కన్వీనర్ ఈ శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఏఓ జ్యోతిర్మయి, ఆర్‌ఐ ప్రవీణ్‌రాయల్, బాలరాజు పాల్గొన్నారు.

వరి, నిమ్మ తోటల పరిశీలన

సైదాపురం: నీట మునిగిన వరి, నేలకొరిగిన నిమ్మ చెట్లను శుక్రవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు పరిశీలించారు. మండలంలోని కలిచేడు, తుమ్మలతలుపూరు, దేవరవేమూరు గ్రామాల్లో నీట మునిగిన వరినారు మడులు, వరి నాట్లను ఏఓ హైమావతి పరిశీలించారు. మండలంలోని చాగణం, కొమ్మిపాడు, లింగసపాళెం, ఆర్వైజీపాళెం గ్రామాల్లో దెబ్బతిన్న నిమ్మ, అరటి తోటలను ఉద్యా నవన శాఖాధికారి ఆనంద్ పరిశీలించారు.



సైదాపురం: అరటి తోటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ

రాపూరు మండలంలో..

రాపూరు:మండలంలోని చెర్లోపల్లెలో నిమ్మ చెట్లను హెచ్‌ఓ ఆనంద్ పరిశీలించారు.



చిల్లకూరు: బాధితులకు బియ్యం, సరుకులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు



చిల్లకూరు: బియ్యం అందజేస్తున్న వెంకటేశ్వర్లు



పెళ్లకూరు: సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



దొరవారిసత్రం: నగదు అందజేస్తున్న అధికారులు

తుపాన్ నష్టాన్ని సీఎంకు వివరించిన ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట: నియోజకవర్గంలో తుపాను నష్టాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికు వివరించారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలో తుపాన్ నష్టాన్ని పరిశీలించేందుకు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో తుపాను నష్టాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నగదు, నిత్యావసరాలు అందజేశామని, పునరావాస కేంద్రాలకు రాని బాధితులకు నగదు ఇవ్వలేదని చెప్పారు. వారికి కూడా నగదు ఇవ్వాలని సీఎంను కోరడంతో బాధితులందరికీ రూ.2500 నగదు ఇవ్వాలని జిల్లాకలెక్టర్ వెంకట రమణారెడ్డిని సీఎం ఆదేశించారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తుపాన్ నష్టాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేటకు డయాలసిస్ సెంటర్ మంజూరు

ఎమ్మెల్యే సంజీవయ్య విజ్ఞప్తి మేరకు సూళ్లూరుపేట సీహెచ్‌సీకి డయాలసిస్ సెంట్ మంజూరు చేశారు.

ప్రభుత్వ ఆర్థిక సాయం పంపిణీ

వెంకటగిరిరూరల్: మండలంలో ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే శ్రీనివాసులురెడ్డి పంపిణీ చేశారు. జేసీఎస్ కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నేత సదారెడ్డి, సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ సభ్యురాలు వరమ్మ, నేతలు రామచంద్రారెడ్డి, వీ మల్లి, కే నారాయణ, జనార్దన్, రాజారెడ్డి పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

కలువాయి: కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పంచాయతీ పాలనపై అవగాహన పెంచుకుని, తమ విధులను నిర్వర్తించాలని ఎంపీడీఓ గోవర్ధన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ పరిపాలనపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వంతో మాట్లాడుతా

చిల్లకూరు: తుపాను బాధితులకు మెరుగైన పరిహారం అందించేలా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ అన్నారు. మండలంలోని నక్కల కాలువ కండ్రిగలోని కాలనీని ఆయన శుక్రవారం పరిశీలించారు. అక్కడ నివాసం ఉన్న వారితో మాట్లాడి తుపాను నష్టం గురించి తెలుసుకున్నారు. అలాగే అక్కడ ఉన్న జగనన్న కాలనీని పరిశీలించారు.

కత్తితో దాడి.. ఒకరికి గాయాలు

తడ: మండలంలోని తడకండ్రిగ పంచాయతీ బీఎల్ పాడు గ్రామానికి చెందిన ఏడుమలై అనే ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటనలో ఉత్తరాఖండ్‌కి చెందిన వివేక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు.. శ్రీసిటీలో పని చేస్తున్న వివేక్, రాజస్థాన్‌కి చెందిన హేమంత్ మహర్షి బుధవారం రాత్రి తడలోని ఓ డాబాలో టిఫిన్‌కి వచ్చారు. టిఫిన్ వచ్చేలోగా వివేక్ సిగరెట్ వెలిగించడంతో పక్క టేబుల్‌పై కూర్చుని ఉన్న ఏడుమలై వివాదానికి దిగాడు. ఆయనతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా వివేక్‌తో వాగ్వివాదం చేస్తున్న సమయంలో సహనం కోల్పోయిన ఏడుమలై అక్కడ ఉన్న కూరగాయలు కోసే కత్తితో వివేక్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో వివేక్ తీవ్రంగా గాయపడడంతో ఏడుమలై పారిపోయాడు. క్షతగాత్రుడిని శ్రీసిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. గురువారం అర్ధరాత్రి బాధితుడి కుటుంబ సభ్యులు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.